క్లుప్తంగా

నేడు హుండీ కానుకల లెక్కింపు

గుడివాడ టౌన్: స్థానిక బంటుమిల్లి రోడ్‌లోని భీమేశ్వరస్వామి దేవస్థానం హుండీలో కానుకల లెక్కింపు సోమవారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ నటరాజన్ షణ్ముగం ఆదివారం తెలిపారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ తనిఖీ అధికారులు, పాలక మండలి సమక్షంలో ఉదయం 11 గంటలకు భక్తులు స్వామికి సమర్పించుకున్న కానుకలు, మొక్కులు లెక్కించనున్నట్లు పేర్కొన్నారు.

కొత్త పైప్‌లైన్ ఏర్పాటు చేయాలి

ముదినేపల్లి రూరల్: జాతీయ రహదారి విస్తరణ పేరుతో ధ్వంసం చేసిన తాగునీటి పైప్‌లైన్ స్థానంలో కొత్త పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని ముదినేపల్లి సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ డిమాండ్ చేశారు. ముదినేపల్లిలో ఆదివారం మాట్లాడుతూ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా ముదినేపల్లి ప్రధాన సెంటర్‌లో డ్రెయినేజీ నిర్మాణ పనులు చేపట్టారన్నారు. ఈ పనుల్లో సరైన నిబంధన పాటించకుండా సంబంధిత కాంట్రాక్టర్ అడ్డగోలుగా తవ్వకాలు చేపట్టినట్లు చెప్పారు. దీనివల్ల పంచాయతీ గతంలో ఏర్పాటు చేసిన తాగునీటి పైపులైన్లు ధ్వంసం కావడంతో తాగునీటికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సరైన రీతిలో రహదారి విస్తరణ పనులు చేపట్టి పంచాయతీ ఆస్తులకు నష్టం కలగకుండా చూడాలన్నారు.

సుబ్బారాయుడిని దర్శించుకున్న భక్తులు



ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో కొలువైయున్న స్వామివారిని భక్తులు ఆదివారం దర్శించుకున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారి పుట్టలో పాలుపోసి దర్శించుకున్నారు. పాలపొంగళ్లశాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారుచేసి స్వామికి సమర్పించారు. నాగబంధాల వద్ద, గోకులంలోని గోవులకు పసుపు, కుంకుమలతో మహిళలు పూజలు చేశారు. ఆలయ ఈవో నేల సంధ్య, సిబ్బంది పర్యవేక్షణ చేశారు.

ఉచిత నేత్ర వైద్యశిబిరం



గుడివాడరూరల్: మండలంలోని కల్వపూడి అగ్రహారంలో ఉచిత నేత్రవైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. విజయ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నేత్రవైద్య శిబిరంలో పరిసర గ్రామాలకు చెందిన ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించిన ఉచితంగా మందులు అందజేశారు. 60 మందికి అవసరమైన కళ్లజోళ్లను ఉచితంగా అందజేశారు. వైద్య శిబిరంలో సేవలు అందించిన డాక్టర్ ప్రభుదాస్‌కు స్థానికులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పరీక్షల కిట్లు పంపిణీ



గుడివాడ టౌన్: ఏలూరు రోడ్‌లోని లక్ష్మీ కంప్యూటర్స్ సౌజన్యంతో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష కిట్లు ఆదివారం పంపిణీ చేశారు. స్థానిక ఏజీకే మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులకు పరీక్ష ప్యాడ్, స్కేలు, రబ్బర్, పెన్సిల్, పెన్నులతో కూడిన కిట్లు అందజేశారు. లక్ష్మీ కంప్యూటర్స్ అధినేత పొట్లూరి గోపి, యాదవ సేవా సంఘం అధ్యక్షుడు పుట్టి హరికుమార్, పాఠశాల హెచ్‌ఎం నర్సమాంబ, ఆర్యవైశ్య ప్రముఖులు బొగ్గారపు తిరుపతయ్య, లయన్స్‌క్లబ్ సభ్యుడు వై.కృష్ణారావు, అబ్దుల్ గఫార్, హరిబాబు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

మోపిదేవి: ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజల దాహార్తిని తీర్చడానికి తిరుపతి శ్రీనివాసరావు(టీఎస్ఆర్) తనయుడు యువ హీరోలు రామ్, హరి ఆధ్వర్యంలో ఆదివారం చల్లని మజ్జిగ పంపిణీ చేశారు. మోపిదేవి శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానానికి వచ్చిన భక్తులు, ప్రయాణికులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకున్నారు.

విగ్రహాలకు ముసుగులు

కోడూరు: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో అధికారులు ఎన్నికల నియమావళి నిబంధనలు అమలు చేసే పనిలో నిమగ్నమయ్యారు. మండలంలోని 13 పంచాయతీ పరిధిలోని రాజకీయ నాయకుల విగ్రహాలకు అధికారులు ముసుగులు వేశారు. కోడూరు బొమ్మల సెంటర్, వంతెన సెంటర్, మెరకగౌడపాలెం, ఉల్లిపాలెం, పిట్టల్లంక, వి.కొత్తపాలెం తదితర గ్రామాల్లో ఎన్టీఆర్, వీఎం రంగాతో పాటు స్థానిక నేతల విగ్రహాలకు ముసుగులు వేశారు.

ప్రజాసేవే లక్ష్యంగా రాజకీయాల్లోకి వచ్చాం

మచిలీపట్నం వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖర్



మాట్లాడుతున్న మచిలీపట్నం వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి చంద్రశేఖర్, పక్కన ఎమ్మెల్యే అనిల్‌కుమార్

పామర్రు: ప్రజాసేవే లక్ష్యంగా సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాజకీయాల్లోకి వచ్చామని, ప్రజలందరూ తమను ఆశీర్వదించాలని మచిలీపట్నం వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖర్ అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌తో కలిసి ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ గతంలో తన తండ్రి సింహాద్రి సత్యనారాయణతో కలిపి 15 ఏళ్ల పాటు పరోక్ష రాజకీయాల్లో పని చేసిన అనుభవం ఉందన్నారు. తాను మచిలీపట్నంలో జన్మించి అవనిగడ్డలో విద్యాభ్యాసం చేసి గుంటూరులో ఎంబీబీఎస్ తదితర కోర్సులను పూర్తి చేసి ఒక వైద్యుడిగా అవనిగడ్డలో స్థిరపడినట్లు తెలిపారు. 22 ఏళ్ల ప్రభుత్వ వైద్యుడిగా విధులు నిర్వహించి అనంతరం ఉద్యోగానికి రాజీనామా చేసి 2013 నుంచి రాజకీయాల్లోకి వచ్చినట్లు తెలిపారు. ఎక్స్‌పర్టు కమిటీలో క్యాన్సర్ విభాగంలో సభ్యుడిగా ఉంటూ క్యాన్సర్ నివారణకు ఎన్నో సూచనలు సలహాలను ఇచ్చినట్లు తెలిపారు. నీతి, నిజాయతీతో పని చేస్తూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ మాట్లాడుతూ ఇచ్చిన మాట నిలబెట్టుకున్న దమ్మున్న నాయకుడు సీఎం జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. ఐదేళ్లలో సంక్షేమ పాలన అందించినట్లు తెలిపారు. ఇచ్చిన వాగ్దానాలు 99 శాతం పూర్తి చేసిన ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని తెలిపారు. విద్య, వైద్యానికి పెద్దపీట వేసి అందరూ చదువుకోవాలని లక్ష్యంగా ఎన్నో సంక్షేమ పథకాలను తీసుకొచ్చి అమలు చేశారన్నారు. మూతపడే స్థాయి నుంచి ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి తీసుకొచ్చి మెరుగైన విద్యాబోధన చేసి ప్రతిఒక్కరినీ విద్యావంతులుగా చేస్తున్నారన్నారు. రాష్ట్రం మరింత సుభిక్షంగా ఉండాలంటే సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. తమ నాయకుడు ఐదేళ్ల పాలనలో చేసిన అభివృద్ధిపై చర్చకు సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు. ఈ నెల 20వ తేదీన మండలంలోని ఎలకుర్రు గ్రామం నుంచి వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తామని తెలిపారు.

డీఎన్నార్ అంటే అభివృద్ధికి చిరునామా



కైకలూరు మండలం దొడ్డిపట్లలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్ సతీమణి వీరాకుమారి

కైకలూరు: నియోజకవర్గంలో ప్రతి గడపకూ మలుమార్లు తిరిగి సమస్యలను పరిష్కరించిన ఘనత ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్)కే దక్కుతుందని ఆయన సతీమణి వీరాకుమారి అన్నారు. దొడ్డిపట్ల గ్రామంలో ప్రచారాన్ని ఆదివారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ డీఎన్నార్ ప్రతి నిమిషం ప్రజల బాగోగుల గురించి ఆలోచిస్తారన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా డీఎన్నార్, ఎంపీగా కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌ను అఖండ మెజారిటీతో గెలిపించాలన్నారు. సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు చెరుకువాడ బలరామరాజు, ఎంపీటీసీ సభ్యులు కర్లం వెంకట లక్ష్మీ దుర్గా శ్రీదేవి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు ఉలిసి వసంత కుమారి, కొవ్వూరి రాధాకృష్ణ, సుండ్రు పద్మావతి, పల్లెవాడ పీఏసీఎస్ అధ్యక్షులు గంగుల అశోక్ పాల్గొన్నారు.

పెదలంకలో..

కలిదిండి మండలం పెదలంకలో ఎమ్మెల్యే డీఎన్నార్ పెద్ద కోడలు శ్రీఅనుపమా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. సర్పంచ్ మహాదేవ విజయబాబు, ఎంపీటీసీ సభ్యులు రావడి నాగ బాలబాలాజీ, ఏఎంసీ చైర్మన్ కొల్లాటి సత్యనారాయణ, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తిరుమాని రమేష్, నాయకులు నామన అన్నవరం, రాంబాబు, ఏసుబాబు, నాగరాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.

డీఎన్నార్‌కు అండగా నిలుస్తాం

కైకలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కైకలూరు వైఎస్సార్ సీపీ అభ్యర్థి దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్)ను గెలిపించి కానుకగా అందిస్తామని పెంచికలమర్రు, వడ్లకూటితిప్ప ప్రజలు పేర్కొన్నారు. సీఎం జగన్ డీఎన్నార్‌పై నమ్మకంతో మరో పర్యాయం సీటు కేటాయించడంపై కైకలూరులో సర్పంచ్ జయమంగళ కాసులు ఆధ్వర్యంలో ఆదివారం పెద్దలు సన్మానించారు. రానున్న ఎన్నికల్లో అందరం కలసి డీఎన్నార్ విజయానికి కృషి చేస్తామని ముక్తకంఠంతో చెప్పారు.

సంక్షేమ సారథికే పట్టం కట్టాలి



వైవాకలో ప్రచారం చేస్తున్న నాయకులు

ముదినేపల్లి రూరల్: నవరత్నాల పేరుతో సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు చేస్తున్న సంక్షేమ సారథి జగనన్నకే రాబోయే ఎన్నికల్లో పట్టం కట్టాలని స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) కోడలు దూలం స్వాతి, ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ అన్నారు. మండలంలోని వైవాకలో సార్వత్రిక ఎన్నికల సందర్భంగా వైఎస్సార్ సీపీ విజయాన్ని కాంక్షిస్తూ ఎన్నికల ప్రచారాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌లకు అఖండ విజయాన్ని చేకూర్చి జగనన్న తిరిగి ముఖ్యమంత్రిని చేసేలా ఆశీర్వదించాలని కోరారు. వైస్ ఎంపీపీలు రాచూరి రాధా, చొప్పర్ల సునీత, మండల కో–ఆప్షన్ సభ్యుడు షేక్ అల్లా భక్షు, నాయకులు ఏసుబాబు, విష్ణువర్ధన్, సతీష్, పృథ్వీ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయానికి కృషి



మాట్లాడుతున్న యువజన విభాగం నాయకులు

గుడివాడ టౌన్: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధించేందుకు ఆ పార్టీ యువజన విభాగం కృషి చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి అద్దేపల్లి పురుషోత్తం అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం గుడివాడ వైఎస్సార్ సీపీ యువజన విభాగం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేసిందన్నారు. వాటిని ప్రతి ఒక్కరికీ వివరిస్తూ తిరిగి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పాటుకు పనిచేయాలని. కార్యక్రమంలో యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మెరుగుమాల కాళీ, రామకృష్ణ(ఆర్కే), పాపిశెట్టి ప్రసాదు, జ్యోతుల మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యానికి డాక్టర్ చంద్రశేఖర్ సిఫార్సు



రోగి మూర్తితో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి డాక్టర్ చంద్రశేఖర్

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం పర్యటనలో ఉన్న వైఎస్సార్ సీపీ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్ ఓ క్యాన్సర్ రోగికి మెరుగైన వైద్యానికి సిఫార్సు చేసిన సంఘటన చోటు చేసుకుంది. తెలుగుచర్పిలో ఎమ్మెల్యే అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు)తో కలిసి ప్రార్థనలో పాల్గొన్న అనంతరం ఆయనను క్యాన్సర్‌తో బాధపడుతున్న 13వ డివిజన్‌కు చెందిన మాలే మూర్తి తన వ్యాధికి సంబంధించిన రిపోర్ట్ లను చూపారు. దీంతో స్పందించిన డాక్టర్ చంద్రశేఖర్ మణిపాల్ ఆసుపత్రికి వెళ్లి వైద్యుడు కృష్ణారెడ్డిని కలవాలని ఆయన మెరుగైన వైద్యం, కిమోథెరపీ చేస్తారని సిఫార్సు లేక రాసి మూర్తికి ఇచ్చారు.

స్పందన కార్యక్రమం రద్దు

మండవల్లి: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ఏర్పాట్లలో అధికారులు బిజీగా ఉన్నందున కలెక్టర్ ఆదేశాల మేరకు మండల కార్యాలయాల్లో నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమం రద్దు చేశారు. ఈ మేరకు ఈఓపీఆర్డీ బి.ఆనందబాబు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

పామర్రులో..

పామర్రు: జిల్లా వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికల ఏర్పాట్లలో అధికారులు బిజీగా ఉన్నందున సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమం రద్దు చేసినట్లు తహసీల్దార్ శ్రీపల్లవి తెలిపారు.

సీఏఏ చట్టాన్ని వ్యతిరేకిద్దాం

గుడివాడ టౌన్: కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన సీఏఏ పౌరసత్వ సవరణ చట్టాన్ని సీపీఎం పూర్తిగా వ్యతిరేకిస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్‌సీపీ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ ఇది పూర్తిగా ప్రజాస్వామ్యానికి విరుద్ధమైన చట్టం అని పేర్కొన్నారు. లౌకిక రాజ్యంలో అన్ని మతాలు, కులాల వారు సమాన హక్కు కలిగి ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎల్‌ఐసీ ఎంప్లాయిస్ నాయకులు జి. కిషోర్ కుమార్, సీఐటీయూ పట్టణ కార్యదర్శి లక్ష్మణరావు, అబ్దుల్ కర్నూస్, హమీద్ పాల్గొన్నారు.

న్యాయవాదికి డాక్టరేటు



గుడివాడ టౌన్: గుడివాడకు చెందిన న్యాయవాది దాసరి సుధాకర్‌కు ఢిల్లీలోని మ్యాజిక్ అండ్ ఆర్ట్స్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ అందజేశారు. సోషల్ వర్కర్ విభాగంలో ఈ పట్టాను పొందినట్లు సుధాకర్ పేర్కొన్నారు. ఈ నెల 16వ తేదీన ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డు అందజేసినట్లు ఆదివారం ఆయన తెలిపారు.

నాంచారమ్మకు ప్రత్యేక పూజలు



కోడూరు: విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ అమ్మవారి ఊరేగింపు భక్తిప్రపత్తులతో కొనసాగుతోంది. అమ్మవారికి ఇంటింటా పూజలు చేసి భక్తులు తమ భక్తిభావం చాటుకుంటున్నారు. ప్రస్తుతం అమ్మవారి గ్రామోత్సవం కుమ్మరిపాలెం గ్రామంలో కొనసాగుతుండగా, భక్తులు చిన్నఅమ్మవారిని తమ నివాస గృహాలకు తీసుకువెళ్లి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటున్నారు. డప్పువాయిద్యాలు, బాణసంచా వెలుగు మధ్య అమ్మవారి ఊరేగింపును రాత్రి వేళ కూడా జరుగుతోంది. ఈ నెల 24,25 తేదీల్లో అమ్మవారి ప్రధాన గుడి జాతర జరగనుండగా, దేవదాయ అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

● అపూర్వ కలయిక



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

స్థానిక అక్కినేని నాగేశ్వరరావు కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. స్థానిక సత్యనారాయణపురంలోని ఉపద్రష్ట బ్రాహ్మణ సత్రంలో ఈ కలయిక చోటుచేసుకుంది. 1972–77 లో ఇంటర్, డిగ్రీ చదివిన పూర్వ విద్యార్థులు కలసి తన పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందోత్సాహాలతో గడిపారు. వారికి విద్యనేర్పిన గురువులను సత్కరించారు.

–గుడివాడ టౌన్

నేడు పెరికెగూడెంలో ప్రజా ఆశీర్వాదయాత్ర

మండవల్లి: మండలంలోని పెరికెగూడెం, శివారు గ్రామం కొత్తూరులలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణతో కలిసి ప్రజా ఆశీర్వాదయాత్రలో పాల్గొంటారని ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు, పాల్గొనాలని ఆయన కోరారు.

ఎన్నికల నియమావళి పాటించాలి

గుడివాడ టౌన్: ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన సందర్భంగా మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ ఎన్నికలు నిర్వహించే రోజు వరకు అమలులో ఉంటుందని ఆర్డీఓ, ఎన్నికల అధికారి అయిన పి. పద్మావతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులు తమ ప్రకటనలు, ప్రకటన వివరాలు, వేయిస్తున్న స్థలం, ప్రకటనల సంఖ్యకు సంబంధించి రిటర్నింగ్ అధికారి అనుమతి పొందాలన్నారు. ఈనెల 16కు ముందు రాజకీయ పార్టీల పేరున ఏర్పాటు చేసిన అన్ని బోర్డులు, ఫ్లెక్సీలు వెంటనే తొలగించాలన్నారు. ప్రచార ప్రకటనలలో అసాంఘిక ప్రకటనలు చేయకూడదని పేర్కొన్నారు. పోలింగ్ బూత్‌కు 200 మీటర్ల పరిధిలో ఎటువంటి ప్రదర్శనలు అనుమతించబోరని ఆర్డీఓ తెలిపారు.

‘పది’ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



తోట్లవల్లూరులో పరీక్ష కేంద్రం

తోట్లవల్లూరు: పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు మండల విద్యాశాఖాధికారి జి. వెంకటేశ్వరరావు ఆదివారం తెలిపారు. మండల వ్యాప్తంగా నాలుగు జెడ్పీ పాఠశాలలకు సంబంధించి 229 మంది విద్యార్థులు పది పరీక్షలు రాస్తున్నట్లు పేర్కొన్నారు. సోమవారం నుంచి ఈ నెల 27వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. వల్లూరుపాలెం జెడ్పీ పాఠశాల విద్యార్థులు తోట్లవల్లూరు కేంద్రంలో, దేవరపల్లి జెడ్పీ పాఠశాల విద్యార్థులు పెనమకూరు కేంద్రంలో పరీక్ష రాయనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

పమిడిముక్కలలో..

పమిడిముక్కల: సోమవారం నుంచి జరగనున్న పది పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశామని ఎంఈఓ–2 శ్రీనివాస్ తెలిపారు. మండల పరిధిలోని నాలుగు కేంద్రాల్లో 561 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని పేర్కొన్నారు. తాడంకి కేంద్రంలో 183 మంది, కపిలేశ్వరపురం కేంద్రంలో 185, పమిడిముక్కల కేంద్రంలో 91, మేడూరు కేంద్రంలో 102 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు.

ఉదయం 8.30 గంటలకే కేంద్రాలకు చేరాలి

కైకలూరు/కలిదిండి: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లను విద్యాశాఖాధికారులు పూర్తి చేశారు. కైకలూరు మండలంలో ఆటపాక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, భుజబలపట్నం ప్రభుత్వ హైస్కూల్, ఆటపాక శ్రీ చైతన్య టెక్నో స్కూల్, కైకలూరు భాష్యం స్కూల్స్‌ను సెంటర్లుగా నిర్ణయించారు. రెగ్యులర్ విద్యార్థులు 777 మంది, ప్రైవేట్ విద్యార్థులు 133 మంది ఉన్నారు. అదేవిధంగా కలిదిండి మండలంలో కలిదిండి, కోరుకొల్లు, భాస్కరరావుపేట, ఆరుతెగళపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, కలిదిండి శశి, కోరుకొల్లు క్రాంతి స్కూల్స్‌ను సెంటర్లగా ఎంపిక చేశారు. వీటిలో రెగ్యులర్ విద్యార్థులు 715 మంది ఉండగా, 308 మంది ప్రైవేటు విద్యార్థులు ఉన్నారు. ప్రతి కేంద్రం వద్ద 144 సెక్షన్ విధించారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. విద్యార్థులు ఉదయం 8.30 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంది.

మంచి పనులు చేశాం.. మళ్లీ ఆశీర్వదించండి



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చేపట్టిన ప్రగతిని వివరిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: నియోజకవర్గ ప్రజలందరికీ మంచి పనులు చేశాం.. తిరిగి తలెత్తుకుని ఓట్లు అడుగుతున్నాం.. అందరూ ఆశీర్వదించాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) కోరారు. ప్రజా సమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగుతున్న ‘గుడ్ మార్నింగ్ కైకలూరు’ కార్యక్రమం ఆదివారానికి 15వ రోజుకు చేరింది. ఎమ్మెల్యే డీఎన్నార్ ప్రజాప్రతినిధులతో కలసి 1, 2 వార్డులలో ఇంటింటికీ తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. అనంతరం ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ నియోజకవర్గంలో పూర్వం ఏ ప్రభుత్వంలో జరగని అభివృద్ధి జరిగిందన్నారు. ప్రతి గ్రామంలోనూ అభివృద్ధి కార్యక్రమాలు పెద్ద ఎత్తున జరిగాయన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనకు, ఎంపీ అభ్యర్థిగా కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌ను అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఎంపీపీ అడవి కృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు స్వాతి, రాష్ట్ర, జిల్లా ముస్లిం, క్రిస్టియన్ మైనారిటీ నాయకులు అబ్దుల్ హమీద్, షేక్ రఫీ, పాట్రిక్ పాల్, ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ దండే పుష్పలత, నాయకులు మోహనరావు, కాసులు, మహ్మద్ గాలిబ్‌బాబు, దండే రవిప్రకాష్, ఉండ్రమట్ల ఏసు, మెడికేర్ నాగరాజు, నిమ్మల సాయి , పంజా నాగు, జక్కా శివాజీ, బిరుదుగడ్డ లాజర్ పాల్గొన్నారు.

ఘనంగా శివాలయ పునఃప్రతిష్ఠాపన



ధ్వజస్తంభ ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు, (ఇన్‌సెట్‌లో) ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

తోట్లవల్లూరు: తోట్లవల్లూరులో రూ.75 లక్షల వ్యయంతో నిర్మించిన శ్రీగంగా పార్వతీ సమేత సకలేశ్వరస్వామి ఆలయ పునఃప్రతిష్ఠా మహోత్సవం ఘనంగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ బ్రహ్మశ్రీ చదలవాడ ఈశ్వరచందు శర్మ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఆలయ పునఃప్రతిష్ఠ, సకలేశ్వరస్వామి, పార్వతీదేవి, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు కోలాహలంగా జరిగాయి. రొయ్యూరుతోపాటు వివిధ గ్రామాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. అనంతరం భారీ అన్నసమారాధన జరిగింది. ఆయా కార్యక్రమాలను ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు మొర్ల రామచంద్రరావు, ఎల్.పరశురామయ్య, ఎల్.లక్ష్మణరావు, ఎల్.వెంకట శ్రీనివాసరావు, వి.మురళీకృష్ణ, ఎం.నాగరాజు, ఎల్.వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

ఎమ్మెల్యే కొడాలి నానీకి సత్కారం



ఎమ్మెల్యే కొడాలి నానీని సత్కరిస్తున్న ఎస్సీ సంఘాల నాయకులు

గుడివాడ టౌన్: గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని)ను పట్టణానికి చెందిన ఎస్సీ సంఘాల నాయకులు ఆదివారం సత్కరించారు. అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ కార్యక్రమం విజయవంతం చేయడం, విగ్రహ ఏర్పాటుకు కావలసిన నిధులు వ్యక్తిగతంగా అందజేస్తానని హామీ ఇవ్వడం పురస్కరించుకుని నానీని సత్కరించినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ సంఘాల నాయకులు మెండా కిరణ్‌కుమార్, కారె జోసఫ్, కాకొల్లు రాజారెడ్డి, బెజ్జం సువర్ణరాజు, మెండా చంద్రపాల్ పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిదారుడికి గోల్డ్ కాయిన్ బహూకరణ



గోల్డ్ కాయిన్‌ను బహూకరిస్తున్న కృష్ణారెడ్డి

పామర్రు: పామర్రు క్లస్టర్‌పరిధిలోని నిభానుపూడి పాల కేంద్రంలోపాలు పోసిన రైతు సీహెచ్ నాగేశ్వరరావు కుమారుడికి కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు ప్రవేశ పెట్టిన కల్యాణమస్తు పథకం కింద నాలుగు గ్రాముల బంగారు నాణాన్ని జిల్లా ట్రస్టు బోర్డు డైరెక్టర్ బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి చేతుల మీదుగా ఆదివారం బహూకరించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు వెన్నా రామకృష్ణ, రూట్ సూపర్‌వైజర్ బాష, పాల కేంద్రం అధ్యక్షుడు, ట్రస్టు బోర్డు జిల్లా సభ్యులు బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి, పామర్రు క్లస్టర్ మేనేజర్ సీహెచ్ గోపిచంద్, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.